PRGI No : TGMUL/25/A1386

తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 353 పేజీలు - 08 సోమవారం 16 నవంబర్ 2026

తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నన్నిల పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

చివరి వన్డేలో భారత్ ఘన విజయం



2లో

- 22 పరుగులతో న్యూజిలాండ్‌పై గెలుపు.. 3-1తో సిరీస్ కైవసం
- అర్ష్‌దీప్, సిరాజ్ బౌలింగ్ ధాటికి కివీస్ విలవిల

చంద్రబాబుకు షర్మిల వివాహ ఆహ్వానం



తొలి అక్షరం/అమరావతి,నవంబర్ 15 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి, సోమల రఘురామ్ రెడ్డి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.చంద్రబాబు నివాసానికి వెళ్లిన షర్మిల పెళ్లి వివరాలను ఆయనకు తెలియజేసి, తప్పక హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ విషయాన్ని ఆమె సామాజిక మాధ్యమాల్లో వెల్లడించారు. ఇప్పటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డితో పాటు పలువురు ప్రముఖులను కలిసి ఆహ్వానించిన షర్మిల, తాజాగా చంద్రబాబును కలవడం రాజకీయ వర్గాల్లో మిగతా2లో...

నక్సలిజం కోరల్లో గిరిజన సమాజం

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో

ఓటు హక్కును కూడా కాలరాశారు

గత పాలకులు ఆదివాసీల

బాధలను పట్టించుకోలేదు

హింస తగ్గడంతో గిరిజన ప్రాంతాల్లో

మారుతున్న పరిస్థితులు

బిర్సా ముండా 151వ జయంతి

సభలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



2లో

సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం అండగా నిలవాలి!

- మూడు కీలక ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు త్వరగా ఇవ్వండి
- తుమ్మిడిహట్టి ఎత్తు 152 మీటర్లకు పెంచేందుకు మహారాష్ట్రను ఒప్పించండి
- సమ్మక్క-సారలమ్మ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ ఇప్పించండి
- భూగర్భ జలాల సంరక్షణకు రూ.5 వేల కోట్ల సాయం అందించండి
- ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తులు



తొలి అక్షరం/న్యూఢిల్లీ, నవంబర్ 15 : తెలంగాణ సాగునీటి రంగానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి, రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మసాగర్, డిండి ఎత్తిపోతల పథకాలకు అవసరమైన పర్యావరణ, ఇతర చట్టబద్ధమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతర్రాష్ట్ర ప్రాజెక్టుల విషయంలో నెలకొన్న అడ్డంకులను తొలగించేందుకు ప్రధాని చొరవ తీసుకోవాలని కోరారు. ఆదివారం ఢిల్లీలోని లోక్‌కల్యాణ్ మార్గ్-7లో ప్రధాని అధికారిక నివాసంలో నరేంద్ర మోదీతో మిగతా2లో...



యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

యువత స్వయం ఉపాధిని ఎంచుకుని పారిశ్రామికవేత్తలుగా రాణించాలి

ఎన్ఎస్ ఇండస్ట్రీస్ ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

తొలి అక్షరం/రంగారెడ్డి జిల్లా, నవంబర్ 15 : యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ సమయాన్ని వృథా చేసుకోకుండా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని, పారిశ్రామికవేత్తలుగా ఎదిగి మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. యువతలోని ప్రతిభ,

మిగతా2లో...

మురను తుపాను విలయం..

- ఏపీకి రూ.2,484 కోట్ల నష్టం!

రైతాంగానికి భారీ దెబ్బ.. తక్షణ సాయం అందించాలని కేంద్రానికి చంద్రబాబు విజ్ఞప్తి



తొలి అక్షరం/అమరావతి, నవంబర్ 15 :మురను తుపాను ఆంధ్రప్రదేశ్‌పై తీవ్ర ప్రభావం చూపింది. రాష్ట్రవ్యాప్తంగా పంటలు, రహదారులు, విద్యుత్ వ్యవస్థ, ఇళ్లు దెబ్బతినడంతో మొత్తం రూ.2,484 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. తుపాను నష్టాలను అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర అంతర్ మంత్రిత్వ శాఖల బృందంతో ఆదివారం ఆయన వర్చువల్‌గా సమావేశమై పరిస్థితిని వివరించారు. రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని కేంద్రాన్ని కోరారు.నాలుగు జిల్లాల్లో 60 ప్రాంతాల్లో పరిశీలన కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల బృందం రెండు బృందాలుగా విడిపోయి బాపట్ల, పల్నాడు, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లోని సుమారు 60 ప్రాంతాల్లో పర్యటించింది. పంట పొలాలు, రహదారులు, కాలువలు,

మిగతా2లో...



సాంకేతిక రంగంలో భారత్ మరింత ముందుకు సాగాలి

ప్రపంచ స్థాయి ఆవిష్కరణలకు కేంద్రంగా ఎదగాలి.. రక్షణ రంగంలో స్వావలంబన సాధించాలి: రాజ్‌నాథ్ సింగ్

ఎన్‌డీటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సహకారం : ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

తొలి అక్షరం/శేరిలింగంపల్లి, నవంబర్ 15 : అధునాతన సాంకేతిక పరిజ్ఞాన రంగంలో భారత్ మరింత పురోగతి సాధించి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలవాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సాంకేతికతను వినియోగించుకోవడమే కాకుండా, సొంతంగా ఆవిష్కరణలు చేపట్టి ప్రపంచానికి అందించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. రక్షణ రంగంలో స్వావలంబన సాధించేందుకు స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను బలోపేతం చేయాలని సూచించారు.హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఎన్‌డీఈ-2026, ఏరోనాట్-2026 అంతర్జాతీయ సదస్సులను ఆదివారం

మిగతా2లో...

విదేశీ పర్యటనలు మాని.. గ్రామాల్లో పర్యటించాలి

- రాహుల్‌గాంధీపై అమిత్‌షా విమర్శలు



2లో

తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు



2లో

నక్సలిజం కోరల్లో గిరిజన సమాజం

తొలి అక్షరం/న్యూఢిల్లీ, నవంబర్ 15 : నక్సల్స్ హింసాకాండ వల్ల అత్యధికంగా నష్టపోయింది గిరిజన సమాజమేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో గిరిజనులను కనీసం ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కూడా లేకుండా చేశారని పేర్కొన్నారు. గిరిజన సమరయోధుడు బిర్సా ముండా 151వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం మహారాష్ట్ర లోని గడ్చిరోలిలో నిర్వహించిన 'జనజాతీయ గౌరవ దివస్' కార్యక్రమంలో మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ఆదివాసీల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. మావోయిస్టులు చిన్నారులను, గిరిజన యువతులను అపహరించుకు పోయిన సందర్భాల్లోనూ పాలకులు మౌనం వహించారని అన్నారు. గిరిజనులను ఓటు వేయనివ్వకుండా అడ్డుకున్నా స్పందించలేదని, సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. నక్సల్స్ హింసతో గిరిజన కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, వారి జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. **హింస తగ్గడంతో గిరిజన ప్రాంతాల్లో మార్పులు** మావోయిస్టు హింసను అదుపులోకి తీసుకురావడంతో గిరిజన ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులు మెరుగుపడుతున్నాయని ప్రధాని తెలిపారు. గతంలో భయాందోళనల మధ్య జీవించిన గిరిజన కుటుంబాలు ఇప్పుడు ప్రశాంత వాతావరణంలో జీవించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. భద్రత పెరగడంతో గిరిజన తల్లులు, సోదరీమణులు ప్రభుత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. హింసాకాండ కారణంగా బాల్యాన్ని కోల్పోయిన చిన్నారులు ప్రస్తుతం విద్యను అభ్యసిస్తూ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా ముందుకు సాగుతున్నారని వివరించారు. **పేదరిక నిర్మూలనలో కీలక పురోగతి** దేశంలో పేదరిక నిర్మూలనకు చేపట్టిన చర్యల ఫలితంగా గత 12 ఏళ్లలో సుమారు 50 కోట్ల మంది అత్యంత పేదరికం నుంచి బయటపడ్డారని మోదీ వెల్లడించారు. స్వాతంత్ర్యం తర్వాత భారత్ సాధించిన అతిపెద్ద విజయాల్లో ఇదొకటని పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధి, వారి హక్కుల పరిరక్షణ, విద్య, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం అండగా నిలవాలి!

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి సమావేశమై మూడు వినతిపత్రాలు అందజేశారు. **రూ.50 వేల కోట్లతో ప్రాజెక్టులు.. ఇంకా అనుమతుల కోసం ఎదురుచూపులు** తెలంగాణ సాగునీరు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కీలక ప్రాజెక్టులపై సీఎం ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు, డిండి ఎత్తిపోతల పథకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు చేసిందని వివరించారు. అయినప్పటికీ పర్యావరణ, ఇతర చట్టబద్ధమైన అనుమతులు పెండింగ్‌లో ఉండటంతో ఆశించిన ప్రయోజనాలు ప్రజలకు అందడం లేదని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన పర్యావరణ అనుమతుల విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు సానుకూల తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఇక ఆలస్యం చేయకుండా అవసరమైన అనుమతులు మంజూరు చేయించాలని కోరారు. రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన నీటి వాటాను వినియోగించుకోవడంలో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. **తుమ్మిడిహట్టి ఎత్తు పెంపునకు మహారాష్ట్రను ఒప్పించండి** ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి ప్రాజెక్టును 152 మీటర్ల ఎత్తుతో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని రేవంత్‌రెడ్డి ప్రధానిని కోరారు. ఇటీవల మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో తాను సమావేశమైన విషయాన్ని వివరించారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే ప్రాంతాలకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్ర సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టుకు మహారాష్ట్ర నుంచి అనుకూల నిర్ణయం వచ్చేలా కేంద్రం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. **సమ్మక్క-సారలమ్మకు ఛత్తీస్‌గఢ్ ఎన్‌వోసీ ఇప్పించండి** సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ఇప్పటికే కేంద్ర జలవనరుల సంఘానికి సమర్పించినట్లు సీఎం తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌ఆర్‌ఎల్), బ్యాక్‌వాటర్ స్థాయిల ఆధారంగా ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే భూములు, గ్రామాలను గుర్తించేందుకు సమగ్ర సర్వే నిర్వహించామని వివరించారు. ఇందుకోసం రూ.9.88 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని, ఆ రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) త్వరగా వచ్చేలా చూడాలని ప్రధానిని కోరారు. **సాస్కీ కింద మరో రూ.5 వేల కోట్లు ఇవ్వండి** రాష్ట్రంలో 70 నుంచి 90 శాతం వరకు పూర్తయిన సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసేందుకు ప్రత్యేక సహాయం అవసరమని రేవంత్‌రెడ్డి తెలిపారు. సాస్కీ పథకం కింద తెలంగాణకు అదనంగా రూ.5 వేల కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిధులను దాదాపు పూర్తయిన ప్రాజెక్టుల పనులకు వినియోగిస్తామని వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోయిందని, భూగర్భ జలాల నిల్వలు తగ్గకుండా సంరక్షించేందుకు ప్రత్యేక కార్యాచరణ అవసరమని పేర్కొన్నారు. భూగర్భ జలాల సంరక్షణకు రూ.5 వేల కోట్ల ఆర్థిక సాయం అందించాలని కోరారు. **పీఎంకేఎస్‌వై కింద నాలుగు ప్రాజెక్టులకు నిధులు** ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) కింద రాష్ట్రంలోని నాలుగు సాగునీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని సీఎం కోరారు. ఇంటిగ్రేటెడ్ సమ్మక్కసాగర్-సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.5,183 కోట్లు, మోదికుంట వాగు ప్రాజెక్టుకు రూ.392 కోట్లు, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.171 కోట్లు, చనాకా-కొరాటా బ్యారేజీకి రూ.103 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టులకు కేంద్రం ఆర్థిక సహకారం అందిస్తే రాష్ట్రంలో సాగునీటి సౌకర్యాలు మరింత విస్తరించే అవకాశం ఉంటుందని వివరించారు. **ఖేలో ఇండియా పోటీలకు సహకరించినందుకు కృతజ్ఞతలు** తెలంగాణలో 8వ ఎడిషన్ ఖేలో ఇండియా క్రీడల నిర్వహణకు అవకాశం కల్పించినందుకు ప్రధాని మోదీకి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 2026 డిసెంబరు 11 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. క్రీడల ప్రారంభోత్సవం, ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానిని ఆహ్వానించారు. 2002లో జాతీయ క్రీడలు, 2007లో ప్రపంచ మిలిటరీ క్రీడలను విజయవంతంగా నిర్వహించిన అనుభవం తెలంగాణకు ఉందని వివరించారు. ప్రధానితో సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయను ఆయన నివాసంలో కలిశారు. ఖేలో ఇండియా పోటీల నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉన్నారు. ప్రధాని భేటీ వివరాలను అనంతరం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి మీడియాకు వెల్లడించారు.

మురసు తుపాను విలయం.. ఏపీకి రూ.2,484 కోట్ల నష్టం!

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ వ్యవస్థ, మత్స్యకారుల బోట్లకు జరిగిన నష్టాన్ని పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడింది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్ స్తంభాలు భారీగా దెబ్బతిన్నట్లు గుర్తించింది. **రైతాంగానికి కోలుకోలేని దెబ్బ** మురసు తుపాను ప్రభావంతో తూర్పుగోదావరి జిల్లాలో 80 శాతం, ఏలూరు జిల్లాలో 90 శాతం వరకు వరి పంట దెబ్బతిన్నట్లు కేంద్ర బృందం తెలిపింది. మామిడి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకూ తీవ్ర నష్టం వాటిల్లిందని వివరించింది. రాష్ట్ర ప్రభుత్వ అంచనాల ప్రకారం 1,43,617 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా, 1,86,063 మంది రైతులు నష్టపోయారు. వ్యవసాయ రంగానికి రూ.875 కోట్లు, ఉద్యాన రంగానికి రూ.337 కోట్ల నష్టం వాటిల్లింది. **రహదారులు, విద్యుత్ వ్యవస్థకు భారీ నష్టం** రాష్ట్రవ్యాప్తంగా 1,385 కిలోమీటర్ల రహదారులు దెబ్బతినడంతో రూ.888 కోట్ల నష్టం సంభవించింది. 10,192 హెచ్‌టీ విద్యుత్ స్తంభాలు, 6,442 ఎల్‌టీ స్తంభాలు, 1,448 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. మొత్తం 3,859 ఇళ్లు ధ్వంసమయ్యాయి. సహాయక చర్యల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.37 కోట్లు ఖర్చు చేసింది. **తక్షణ సాయం అందించాలని విజ్ఞప్తి** వరుస తుపాన్లు, ఎల్‌నినో ప్రభావంతో రైతాంగం సహా పలు రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని చంద్రబాబు కేంద్ర బృందానికి వివరించారు. తీర ప్రాంతాల్లో భవిష్యత్తులో తుపాన్లను తట్టుకునేలా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నష్టాలపై సమగ్ర నివేదికను త్వరగా కేంద్రానికి సమర్పించి, బాధితులకు తక్షణ ఆర్థిక సాయం అందేలా చూడాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు తగిన పరిహారం, బాధిత కుటుంబాలకు అదనపు సహాయం అందించే అంశాలను కూడా పరిశీలించాలని కేంద్ర బృందం సూచించింది.

సాంకేతిక రంగంలో భారత్ మరింత ముందుకు సాగాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్‌డీటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణను ప్రపంచస్థాయి ఏరోస్పేస్, రక్షణ రంగ కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు.పరిశ్రమల భద్రత, నాణ్యత ప్రమాణాల పరిరక్షణలో నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ (ఎన్‌డీటీ) నిపుణుల పాత్ర కీలకమని డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్, ఇండియన్ సొసైటీ ఫర్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ అధ్యక్షుడు డాక్టర్ జైటీర్థ్ ఆర్.జోషి పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో దేశ విదేశాలకు చెందిన 2 వేల మందికి పైగా నిపుణులు, 100కు పైగా సంస్థల ప్రతినిధులు పాల్గొంటున్నారు.

చివరి వన్డేలో భారత్ ఘన విజయం

తొలి అక్షరం/మౌంట్ మాంగనుయ్,నవంబర్ 15 : న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను టీమ్ ఇండియా 3-1తో కైవసం చేసుకుంది. ఆఖరి వన్డేలో భారత జట్టు 22 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 42.1 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌటైంది. స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో భారత బౌలర్లు సమిష్టిగా రాణించి న్యూజిలాండ్‌ను 48.1 ఓవర్లలో 187 పరుగులకే కట్టడి చేశారు.భారత ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్, అక్షర్ పటేల్ చెరో 46 పరుగులతో కీలక పాత్ర పోషించారు. ఆరంభంలో రోహిత్ శర్మ (7), విరాట్ కోహ్లీ (5) త్వరగా వెనుదిరగడంతో భారత్ కష్టాల్లో పడింది. ఈ దశలో అక్షర్, ఇషాన్ విలువైన భాగస్వామ్యాలతో జట్టును ఆదుకున్నారు. చివర్లో మహ్మద్ సిరాజ్ (14 నాటౌట్), అర్ష్‌దీప్ సింగ్ (14) మెరుపు బ్యాటింగ్‌తో జట్టు స్కోరును 209కి చేర్చారు. **బౌలర్ల సమష్టి ప్రదర్శన**210 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌ను భారత బౌలర్లు నిలకడగా దెబ్బతీశారు. డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ (31), నిక్ కెల్లీ (24), మిచెల్ శాంట్నర్ (24) పోరాడినా ఫలితం లేకపోయింది. అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లు పడగొట్టగా, మహ్మద్ సిరాజ్, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు సాధించారు. మిగతా బౌలర్లు కూడా సహకరించడంతో కివీస్ 187 పరుగులకే పరిమితమైంది.ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న అర్ష్‌దీప్ సింగ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. గుర్నూర్ బరార్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు. దీంతో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 3-1తో సొంతం చేసుకుంది.

చంద్రబాబుకు షర్మిల వివాహ ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాధాన్యత సంతరించుకుంది.షర్మిల కుమార్తె వివాహం నవంబర్ 25న జరగనుండగా, డిసెంబర్ 5న విందు కార్యక్రమం నిర్వహించనున్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

(మొదటి పేజీ తరువాయి)

నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుంటే పారిశ్రామిక రంగంలో అనేక అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు.ఆదివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మంఖాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్ఎస్ ఇండస్ట్రీస్ పరిశ్రమను ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమ స్థాపించిన యువ పారిశ్రామికవేత్తలు విశాల్, సాగర్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఉన్నత విద్యను అభ్యసించిన యువకులు ఉద్యోగాల కోసం ఇతరులపై ఆధారపడకుండా, సొంతంగా పరిశ్రమను స్థాపించి పారిశ్రామిక రంగంలోకి అడుగుపెట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. **మరికొందరికి ఉపాధి కల్పించడమే లక్ష్యం కావాలి** యువత కేవలం తమ కుటుంబాల అభివృద్ధికే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడేలా ఆలోచించాలని భట్టి విక్రమార్క సూచించారు. స్వయంగా ఉపాధి పొందడంతోపాటు ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. నూతన ఆలోచనలు, సృజనాత్మకత, పట్టుదలతో ముందుకు సాగితే యువత విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగగలదని తెలిపారు. **పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ సహకారం** రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు, యువ పారిశ్రామికవేత్తల ప్రోత్సాహానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. పరిశ్రమలు ప్రారంభించాలనుకునే యువతకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విశాల్, సాగర్ తమ పరిశ్రమను మరింత విస్తరించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, భవిష్యత్తులో మరెందరో యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.యువత సాధించే విజయాలు వ్యక్తిగత అభివృద్ధితోపాటు సమాజ పురోగతికి కూడా దోహదపడాలని, పారిశ్రామికవేత్తలు సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ ఉపాధి అవకాశాల కల్పనలో ముందుండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సీపీఓ సౌమ్య, జీఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, పలువురు పారిశ్రామికవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

విదేశీ పర్యటనలు మాని.. గ్రామాల్లో పర్యటించాలి

- రాహుల్‌గాంధీపై అమిత్‌షా విమర్శలు

తొలి అక్షరం/పుణె, నవంబర్ 15 :
అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు చేస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విమర్శించారు. భారత్ అభివృద్ధి, ప్రజాస్వామ్య వ్యవస్థపై విదేశీ ప్రతినిధుల సమక్షంలో విమర్శలు చేయడం సరికాదని అన్నారు. అధికారంలోకి రావాలంటే విదేశీ పర్యటనలు మాని, దేశంలోని గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని రాహుల్‌గాంధీకి సూచించారు.ఆదివారం మహారాష్ట్రలోని పుణెలో జరిగిన కార్యక్రమంలో అమిత్‌షా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్‌లో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. భారత్ పేరుతో నిర్వహించిన సదస్సులోనే దేశ ప్రతిష్ఠను దిగజార్చేలా మాట్లాడటం దురదృష్టకరమని ఆరోపించారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరించకూడదని పేర్కొన్నారు.వరుస ఎన్నికల పరాజయాల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకత్వం నిరాశతో దేశంపై విమర్శలు చేస్తోందని అమిత్‌షా ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో భారీ అవినీతి జరిగిందని విమర్శిస్తూ, ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం 12 ఏళ్లలో సాధించిన అభివృద్ధిని వివరించారు. కాంగ్రెస్ నేతలు ఇదే వైఖరిని కొనసాగిస్తే మరో 30 ఏళ్లపాటు అధికారానికి దూరంగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు.

తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు

- కాంగ్రెస్, బీజేపీ నేతల తీరుపై కేటీఆర్ ధ్వజం



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 15 : తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్, బీజేపీ నేతలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం తాకట్టు పెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. జాతీయ నాయకుల మెప్పు కోసం రాష్ట్ర గౌరవాన్ని పక్కనపెట్టి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గాంధీ కుటుంబానికి బాడీగార్డులా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ బైక్ వెంట మంత్రి, పీసీసీ అధ్యక్షుడు పరుగెత్తిన తీరును ప్రస్తావిస్తూ.. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఈ వ్యవహారం ఉందని విమర్శించారు.మరోవైపు కేంద్ర మంత్రి అమిత్‌షాకు బీజేపీ రాష్ట్ర నాయకులు ఇస్తున్న ప్రాధాన్యంపైనా కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. అమిత్‌షా కాళ్లకు నమస్కరిస్తూ, ఆయన చెప్పులు మోసే స్థాయికి దిగజారడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రం ఆత్మగౌరవం, స్వాభిమానం కోసం జరిగిన పోరాట ఫలితంగా ఏర్పడిందని, ఆ విలువలను కాంగ్రెస్, బీజేపీ నేతలు విస్మరిస్తున్నారని కేటీఆర్ తన 'ఎక్స్' పోస్టులో విమర్శించారు.

ఆత్మహత్యాయత్నం చేసుకున్న వ్యక్తిని కాపాడిన పోలీసులు

తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్15: వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడిన ఓ వ్యక్తి ప్రాణాలను పర్వతగిరి పోలీసులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సకాలంలో కాపాడారు.ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించగా, పోలీసుల స్పందనపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పర్వతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని చామలతండా గ్రామానికి చెందిన గుగులోతు సురేష్ అనే వ్యక్తి తీవ్ర మనస్తాపంతో క్రిమిసంహారక మందు (పురుగుల మందు) సేవించి ఆత్మహత్యకు యత్నించాడు.ఈ విషయాన్ని బాధితుడు తన అన్నకు ఫోన్ చేసి చెప్పడంతో, ఆయన వెంటనే అప్రమత్తమై డయల్ 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. **సాంకేతిక పరిజ్ఞానంతో ఆచూకీ గుర్తింపు:** సమాచారం అందుకున్న వెంటనే బీసీ డ్యూటీలో ఉన్న హెడ్ కానిస్టేబుల్/కానిస్టేబుల్ చంద్రశేఖర్ అప్రమత్తమయ్యారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని (టెక్నాలజీ) ఉపయోగించి సురేష్ ఆచూకీని వేగంగా కనిపెట్టారు.వెంటనే ఆ ప్రాంతానికి చేరుకోగా, అప్పటికే సురేష్ ఆపస్మారక స్థితిలో అచేతనంగా పడి ఉన్నట్లు గుర్తించారు. **సకాలంలో స్పందన..నిలకడగా ఆరోగ్యం:** క్షణం కూడా ఆలస్యం చేయకుండా కానిస్టేబుల్ చంద్రశేఖర్ బాధితుడి బంధువైన బాదవత్ వెంకన్నను అక్కడికి పిలిపించారు. వెంటనే 108 అంబులెన్సుకు సమాచారం అందించి అందులో సురేష్‌ను నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు అందించిన చికిత్సతో సురేష్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. **పోలీసులపై ప్రశంసల వర్షం:** ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని అప్రమత్తతతో, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రక్షించిన కానిస్టేబుల్ చంద్రశేఖర్‌ను పర్వతగిరి సిఐ సంతోష్, ఎస్సై రాజ్ కుమార్‌లు ప్రత్యేకంగా అభినందించారు.అలాగే స్థానిక గ్రామీణ ప్రజలు, చామలతండా గ్రామస్తులు పోలీసుల సేవలను కొనియాడుతూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.





పెన్షన్ కార్డు ప్రకటనలతో జరభద్రం

- సామాజిక మాధ్యమాల్లో నకిలీ లింకులు,ఏపీకే ఫైళ్లతో సైబర్ వల
- వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సీఐ పి.సైదులు హెచ్చరిక




తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్15: ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో పెన్షన్ కార్డు పేరుతో వస్తున్న నకిలీ ప్రకటనల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బేగంపేట సీఐ పి.సైదులు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో పింఛనుదారులను లక్ష్యంగా చేసుకుని బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారని తెలిపారు.**ఏపీకే ఫైళ్లతో ఖాతాలు ఖాళీ:**సామాజిక మాధ్యమాల్లో కనిపించే పెన్షన్ కార్డు ప్రకటనలపై క్లిక్ చేయగానే నేరుగా వాట్సాప్‌నకు మళ్లుతుందని సీఐ వివరించారు.అక్కడ సైబర్ మోసగాళ్లు వ్యక్తిగత వివరాలు అడగడంతో పాటు పెన్షన్ ఫాం లేదా వెరిఫికేషన్ పేరుతో ఏపీకే ఫైళ్లను పంపుతారని పేర్కొన్నారు.పొరపాటున ఆ ఫైళ్లను డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేసుకుంటే ఫోన్ హ్యాక్ అయ్యి, బ్యాంకు ఖాతాల్లోని నగదు మాయమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.**అధికారిక వెబ్‌సైట్లనే నమ్మాలి:** కేంద్ర ప్రభుత్వ పెన్షన్‌కు సంబంధించిన ఎలాంటి అధికారిక సమాచారం కోసమైనా కేవలం pensionersportal.gov.in వెబ్‌సైట్‌ను మాత్రమే సందర్శించాలని సీఐ సైదులు స్పష్టం చేశారు.ఏదైనా బ్యాంకుకు సంబంధించిన పెన్షన్ కార్డు, పథకం లేదా ఆఫర్ల గురించి తెలుసుకోవాలంటే ఆయా బ్యాంకుల అధికారిక వెబ్‌సైట్,కస్టమర్ కేర్ నంబర్ లేదా సమీపంలోని బ్రాంచ్‌ను నేరుగా సంప్రదించి ధృవీకరించుకోవాలని సూచించారు.ఎవరైనా సైబర్ ఆర్థిక మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్

- వారం రోజుల్లో 365 మంది
- మందుబాబుల పట్టివేత.. ఒకరికి జైలు శిక్ష

తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), నవంబరు15: మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై మల్కాజిగిరి కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ నెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 365 మంది పట్టుబడ్డారని మల్కాజిగిరి ట్రాఫిక్ డీసీపీ ఒక ప్రకటనలో తెలిపారు.**పట్టుబడిన వాహనాలు, వ్యక్తుల వివరాలు:** వాహనాల వారీగా: ద్విచక్ర వాహనదారులు 306 మంది, కార్లు (నాలుగు చక్రాలు) నడిపిన వారు 42 మంది, ఆటోలు (మూడు చక్రాలు) నడిపిన వారు 17 మంది ఉన్నారు.వయసు వారీగా: 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న యువకులు అత్యధికంగా 259 మంది పట్టుబడగా, 40 నుంచి 60 ఏళ్ల వారు 97 మంది, 60 ఏళ్లు పైబడిన వారు ఐదుగురు ఉన్నారు. మరో నలుగురి వయసు వివరాలు నమోదు కాలేదు. 18 ఏళ్ల లోపు మైనర్లు ఎవరూ పట్టుబడలేదు.మద్యం మోతాదు (బీఏసీ స్థాయి): పట్టుబడిన వారిలో 334 మందికి 36 నుంచి 200 మి.గ్రా/100 మి.లీ మధ్య మద్యం స్థాయి నమోదు కాగా, 23 మందికి 201 నుంచి 300 మి.గ్రా మధ్య నమోదైంది. ఎనిమిది మంది అత్యంత ప్రమాదకర స్థాయిలో (300 మి.గ్రా పైగా) మద్యం సేవించి వాహనాలు నడుపుతూ చిక్కారు.**215 కేసుల పరిష్కారం.. 44 మందికి సామాజిక సేవ:**పట్టుబడిన 365 మందిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా, గత వారం రోజుల్లో కోర్టులో మొత్తం 215 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో ఒకరికి జరిమానాతో పాటు జైలు శిక్ష పడగా, 44 మందికి జరిమానాతో పాటు సామాజిక సేవ (సోషల్ సర్వీస్) చేసేలా కోర్టు తీర్పునిచ్చింది. మిగిలిన 170 మందికి కేవలం జరిమానా విధించింది.**హెచ్చరిక.. ప్రమాదాలు చేస్తే 10 ఏళ్ల జైలు:**మద్యం మత్తులో వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ ప్రాణాంతక ప్రమాదాలకు కారణమైతే భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) 2023లోని సెక్షన్ 105 కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సెక్షన్ కింద నేరం రుజువైతే గరిష్ఠంగా 10 సంవత్సరాల జైలు శిక్ష తోపాటుజరిమానాపడేఅవకాశం ఉందని పేర్కొన్నారు.



షూటింగ్ బాల్‌లో హోరాహోరీ సమరం

- ఉత్కంఠగా 45వ రాష్ట్రస్థాయి బాలికల ఛాంపియన్‌షిప్ పోటీలు
- క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లిన జట్లు..నేడు తుది పోరు





తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్15:పర్వతగిరి మండలం అన్నారంలోని పల్లవి మోడల్ స్కూల్ వేదికగా జరుగుతున్న 45వ రాష్ట్రస్థాయి బాలికల షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి తరలివచ్చిన క్రీడాకారిణులు గెలుపే లక్ష్యంగా మైదానంలో హోరాహోరీగా తలపడుతున్నారు.లీగ్ దశలో జట్లను వివిధ పూల్స్‌గా విభజించి పోటీలు నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతి పూల్ నుంచి రెండేసి జట్లు చొప్పున క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయి. క్రీడాకారిణులు ప్రదర్శిస్తున్న వేగం, పట్టుదల, జట్టు సమన్వయం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సోమవారం జరగనున్న ఫైనల్ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయనున్నారు.పోటీలను తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి యువత, క్రీడాభిమానులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. రాత్రి వేళల్లోనూ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరుగుతున్న మ్యాచ్‌లను ప్రేక్షకులు ఆసక్తిగా వీక్షిస్తుండటంతో పాఠశాల ప్రాంగణం క్రీడా సందడితో కళకళలాడుతోంది.రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఐలయ్య ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌ను నిర్వాహకులు పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు నాగయ్య, ప్రధాన కార్యదర్శి రమేష్, పల్లవి మోడల్ స్కూల్ చైర్మన్ రాచకొండ అశోక్‌చారి, కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కోటగిరి రమేష్, ప్రిన్సిపల్ మేకల అశ్విని, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారు.

రెడ్ క్రాస్‌కు స్థలం, నిధులు కేటాయించండి

- ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలి
- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు వరంగల్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు వినతి
- చేనేత కార్మికుల సమస్యలపైనా చర్చ

తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్15: వరంగల్ జిల్లాలో రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తరించేందుకు సంస్థకు అవసరమైన స్థలంతో పాటు తగిన నిధులు కేటాయించాలని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బేతి అశోక్ బాబు రాష్ట్ర గవర్నర్,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు శివ ప్రతాప్ శుక్లాను కోరారు.ఆదివారం ఆయన గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, వరంగల్ చేనేత కళాఖండాలైన కార్పెట్, టవల్, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.అనంతరం అశోక్ బాబు మాట్లాడుతూ...రక్తనిధి సేకరణ కార్యక్రమంలో గ్రామాలు, మండలాలు, వార్డుల స్థాయి ప్రజాప్రతినిధులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, వార్డు సభ్యులను ఏడాదికి ఒకసారి భాగస్వాములను చేయాలని అశోక్ బాబు గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు.దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో ఉన్న నిరుపేదలు, బాధితులకు మెరుగైన వైద్య, రక్తనిధి సేవలు అందించవచ్చని వివరించారు.అలాగే జిల్లాలోని కొత్తవాడ, శాంపేట ప్రాంతాలకు చెందిన చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. వారి జీవనోపాధిని కాపాడి, కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.



స్పందించిన గవర్నర్:జిల్లా అభివృద్ధి, రెడ్ క్రాస్ కార్యకలాపాలు, చేనేత కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ దానకిషోర్, రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు, ఎస్ఎంసీ నాడం శాంతికుమార్, అభయ ఫౌండేషన్ ప్రతినిధి బాలచంద్ర, రెడ్ క్రాస్ యూత్ వింగ్ ప్రతినిధి బేతి సాయి తదితరులు పాల్గొన్నారు.

బోడుప్పల్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

- బోడుప్పల్ ఆపరేషన్స్ ఏఈ ఎన్. వేణుగోపాల్



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్15:
33/11 కేవీ బోడుప్పల్ సబ్-స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆపరేషన్స్ ఏఈ ఎన్. వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.**విద్యుత్ అంతరాయం కలిగే ఫీడర్లు, ప్రాంతాల వివరాలు:**11 కేవీ బృందావన్ కాలనీ ఫీడర్: రాఘవేంద్ర కాలనీ, సాయి మారుతి నగర్, ఉదయ లక్ష్మీ నగర్, కేశవ్ నగర్ లు ఉన్నాయి11 కేవీ ఉదయ నగర్ ఫీడర్: ఈస్ట్ బృందావన్ కాలనీ, వెస్ట్ బృందావన్ కాలనీ, శ్రీనివాస నగర్ కాలనీ, సత్తిరెడ్డి కాలనీ, ఉదయ లక్ష్మీ నగర్, కేశవ్ నగర్, ఆకృతి టౌన్‌షిప్.11 కేవీ ద్వారకా నగర్ ఫీడర్: ద్వారకా నగర్ ఫేజ్-2.11 కేవీ సత్తిరెడ్డి కాలనీ ఫీడర్: సత్తిరెడ్డి కాలనీ, సాయిరాం నగర్, బృందావన్ కాలనీ, సాయి భవానీ కాలనీ, శ్రీనివాస కాలనీ లు ఉన్నాయి.వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

నల్గొండలో జరిగే 36వ అఖిలభారత రైతు మహాసభలకు బయలుదేరిన జోహార్ నగర్ నాయకులు



తొలి అక్షరం/జవహర్ నగర్, నవంబర్ 15:ఈరోజు తెలంగాణ రాష్ట్రంలో నల్లగొండలో జరగబోయే అఖిలభారత రైతు సంఘం మహాసభలకు మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ నగర కమిటీ ఆధ్వర్యంలో బయలుదేరడం జరిగినది. ఈ యొక్క కార్యక్రమంలో జోహార్ నగర్ సిపిఎం నగర కార్యదర్శి టి. శివన్నారాయణ మాట్లాడుతూ అఖిల భారత రైతు మహాసభ ఉద్దేశం ఈరోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తూ, స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలని, రైతులకు 24 గంటలు కరెంటు ఇవ్వాలని, లావు ఒడ్లు పండించిన రైతులకు కూడా బోనస్ ఇవ్వాలని, రైతులకు ఎరువులు సకాలంలో సబ్సిడీలు అందించాలి, రైతు పండించిన పంటలకి భీమ కల్పించాలి. ఎల్ ని నో కారణంగా అధిక ఉష్ణోగ్రత కారణంగా భూగర్భ జలాలు ఎండిపోయి పంట నష్టం జరిగిన రైతులకు ఎకరానికి ₹15000 ప్రభుత్వం కేటాయించాల నీ డిమాండ్ చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సురేందర్ కర్నే, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు కే బాలు, సిఐటియు జవహర్ నగర్ నాయకులు ఏ వెంకన్న, ఆర్ రూప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యుటీఎఫ్ చౌటుప్పల్ మండల కమిటీ ఎన్నిక

జీవో 25ను సవరించి ప్రాథమిక విద్యను పరిరక్షించాలి: ముక్కెర్ల యాదయ్య





తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 15:చౌటుప్పల్ మండల టీఎస్‌యుటీఎఫ్ మహాసభ ఆదివారం మండల అధ్యక్షుడు కె. శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ముక్కెర్ల యాదయ్య మాట్లాడుతూ ప్రాథమిక విద్య పరిరక్షణకు జీవో నంబర్ 25ను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ఒక గది ఏర్పాటు చేయాలని, పాఠశాలల విలీన ఆలోచనలను విరమించుకోవాలని కోరారు.ఉపాధ్యాయులకు 51 శాతం ఫిట్‌మెంట్, హెల్త్ కార్డులు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు, కేజీబీవీ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని కోరారు.జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి సభ్యులంతా ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చౌటుప్పల్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీ: అధ్యక్షుడిగా జి. జగన్, ప్రధాన కార్యదర్శిగా ఎస్. పరమేశం, ఉపాధ్యక్షులుగా పి. విజయ ప్రతాప్, బి. సునంద, కోశాధికారిగా వి. నరేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు కొసనం మమత, కోశాధికారి బొమ్మగోని ముత్యాలు, కార్యదర్శి పజ్జూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివదీక్ష స్వాములకు అన్నదానం నిర్వహించిన పల్లె గోవర్ధన్ రెడ్డి సౌమ్య దంపతులు

- భక్తి భావంతో అన్నదాన కార్యక్రమం.. దంపతులకు శివ స్వాముల ఆశీస్సులు







తొలి అక్షరం/చౌటుప్పల్. నవంబర్ 15: చౌటుప్పల్ పట్టణంలోని ఒలిగొండ రోడ్డులో గల శ్రీ మోక్షలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాస శివదీక్ష చేపట్టిన స్వాములకు పల్లె గోవర్ధన్ రెడ్డి సౌమ్య దంపతులు ఈరోజు భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా శివదీక్ష స్వాములు మాట్లాడుతూ కార్తీకమాసంలో శివదీక్ష చేపట్టిన స్వాములకు అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని పేర్కొన్నారు. భక్తిభావంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన పల్లె గోవర్ధన్ రెడ్డి సౌమ్య దంపతులపై ఆ పరమశివుని కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, వారి వ్యాపారాలు దినదినాభివృద్ధి చెందాలని ఆ పరమశివుడిని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో భక్తిభావాన్ని, సేవా స్ఫూర్తిని పెంపొందిస్తాయని ఈ సందర్భంగా స్వాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురు స్వామి ఆదిమూలం శంకర్, వీరమల్ల దాసు గౌడ్, కుక్కల నరసింహ, జూలు శంకరయ్య,గోగులోతు శంకర్ నాయక్, దోర్నాల గజేందర్, కందగట్ల శ్రీను,ముప్పిడి కృష్ణ చైతన్య, ఇట్టగొని విగ్నేష్, పున్న శివ, భీమనగొని బాల శివ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లసింగారం 2వ వార్డులో కాంగ్రెస్ కమిటీలు

- వార్డు అధ్యక్షుడిగా సుర్వి నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మారుపాక ప్రభాకర్ గౌడ్ ఎన్నిక





తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 15:చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లసింగారం 2వ వార్డులో కాంగ్రెస్ నూతన బూత్, వార్డు కమిటీలను ఏర్పాటు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచనలు, డీసీసీ ఆదేశాల మేరకు మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.వార్డు అధ్యక్షుడిగా సుర్వి నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మారుపాక ప్రభాకర్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయడంతో పాటు పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలు కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌడ సంఘం మండల మహిళా అధ్యక్షురాలిగా రామతార పద్మ గౌడ్



తొలి అక్షరం/నెల్లికుదురు నవంబర్ 15: నెల్లికుదురు మండలంతెలంగాణ సంక్షేమ సంఘం మహిళా మండలి అధ్యక్షురాలుగా బ్రాహ్మణ కొత్తపల్ల గ్రామానికి చెందిన పెరుమాండ్ల రామతార పద్మగౌడ్ , గౌడ సంక్షేమ సంఘం ేమండల అధ్యక్షుడిగా వావిడల గ్రామానికి చెందిన బల్లెపల్లి శ్రీనివాసుగౌడ్ నీ నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర గౌడ సంక్షేమ సంఘం సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గట్టు రామచంద్ర రావు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని లండన్ పబ్లిక్ స్కూల్లో మహిళా మండలి జిల్లా అధ్యక్షురాలు గండి శారద, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డి వీరేందర్ తో కలిసి నియామక పత్రాన్ని అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ సంక్షేమ సంఘం అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలని అన్నారు. గౌడ సంఘం నుంచి తాటిచెట్టు పై తాడి మృతి చెందిన కుటుంబానికి ధన సంతానం డబ్బులతో రూ 5000 అందించే కార్యక్రమాన్ని కూడా రూపొందిస్తున్నానని ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి గౌడ ఐక్యత ఉండి పోరాటం చేసి సాధించుకునే స్థాయికి ఎదగాలని అన్నారు. నిజంగా గౌడ్ అంత ఐక్యత ఉండి పోరాటాలు చేసి అక్కుల సాధనకై ఉద్యమించాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎన్నిక కాబడిన మహిళా మండల అధ్యక్షురాలు పెరుమాండ్లరామతార పద్మ, మరియు గోడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా నియమకమైన గొల్లపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ నా వెనుకకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు అని తెలిపారు. సంఘం అభివృద్ధి కోసం సంఘం సభ్యుల సమస్యలపై నిరంతరం పోరాడుతమని సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి సాయి గౌడ్, కరింగుల సాగర్ గౌడ్, ఆ సంఘం వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాలే ముఖ్యం

- పిల్లాయిపల్లి కాలువ పనులు వాయిదా వేయాలి: డా. శ్రీధర్ రెడ్డి




తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 15:పిల్లాయిపల్లి కాలువ పునరుద్ధరణ పనులను ఈ నెల 25 నుంచి చేపట్టాలనే నిర్ణయాన్ని తక్షణమే వాయిదా వేయాలని మందోళ్లగూడెం ఉపసర్పంచ్, యాదాద్రి భువనగిరి జిల్లా ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు డా. సుర్కంటి శ్రీధర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.కాలువ పనులకు తాము వ్యతిరేకం కాదని, ప్రస్తుత పరిస్థితుల్లో పనులు చేపడితే రైతులకు సాగునీరు, గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వేసవిలో నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని వచ్చే ఏడాది అనుకూల సమయంలో పనులు చేపట్టాలని సూచించారు.ఈ సమస్యపై రాజకీయాలకు అతీతంగా రైతులు, ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రైతుల సాగునీరు, ప్రజల తాగునీటి హక్కుల పరిరక్షణే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

పెద్దవంగర మండల కుమ్మరి సంఘం నూతన కమిటీ ఎన్నిక

- మండల కన్వీనర్‌గా రాయరపు రాజు, కో కన్వీనర్‌గా కొలిపాక అనిల్ ఎన్నిక



తొలి అక్షరం/పెద్దవంగర నవంబర్ 15: పెద్దవంగర మండలం లోని కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో కుమ్మరి సంఘం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. జిల్లా కన్వీనర్ అలువల ఉపేందర్, కో కన్వీనర్ సముద్రాల సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు కొత్తపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఈ కమిటీ ఎన్నిక నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కన్వీనర్‌గా రాయరపు రాజు, కో కన్వీనర్‌గా కొలిపాక అనిల్, మహిళా సంఘం విభాగం కన్వీనర్‌గా రాయరపు కనకమ్మను ఎన్నుకున్నారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా పగిడిపాల రమేష్‌ను నియమించారు.కమిటీ సభ్యులుగా గంగాధరి మురళి, పాలవెల్లి సోమన్న, రాయరపు స్వామి, రాయరపు నగేష్, కోరేపు సోమన్న, గంగాధరి సాయి తదితరులను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు కుమ్మరి సంఘం అభివృద్ధికి, కులస్తుల ఐక్యతకు, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.



పల్లె పల్లెకు మాలల చైతన్య యాత్ర'కు సేవాలాల్ సేన సంపూర్ణ మద్దతు

- మాలల చైతన్య యాత్ర సభకు ముఖ్య అతిథిగా భుక్యా నరసింహ నాయక్



తొలి అక్షరం/ ఏన్కూర్ నవంబర్ 15: ఏన్కూర్ మండలం ఇందిరానగర్ కాలనీలో మాల ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పల్లె పల్లెకు మాలల చైతన్య యాత్ర' ప్రారంభ సభకు సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు భూక్య నరసింహ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ రాథోడ్, మండల అధ్యక్షుడు మజీలాల్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై తమ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు భూక్య నరసింహ నాయక్ మాట్లాడుతూ గిరిజనులు, దళితులు, బహుజనులంతా ఐక్యంగా పోరాడితేనే తమ రాజ్యాంగబద్ధమైన హక్కులను సాధించుకోగలరని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు చేవెళ్ల సభలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రకటించిన 12 హామీలను (చేవెళ్ల డిక్లరేషన్) తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ప్రస్తుతం అమలు చేస్తున్న ఎస్సీ వర్గీకరణ విధానంలో రోస్టర్ పాయింట్ల విషయంలో మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచించి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వ సర్వేలలో జనాభా లెక్కలను తప్పుగా చూపడాన్ని తీవ్రంగా ఖండించారు. రానున్న రోజుల్లో ఎస్సీ, ఎస్టీ, బహుజనులందరూ ఏకమై తమ ఓటు బలంతో రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాల ఆర్గనైజేషన్ కన్వీనర్ దాసరి రమేష్, ఇతర ముఖ్య నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నూతన ఎసిబి కార్యాలయాన్ని ప్రారంభించిన ఎసిబి డీఎస్పీ వై రమేష్

తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి డిసెంబర్ 15: ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ కార్యాలయం ఖమ్మంలోని విడోస్ కాలనీ నుండి పాత మున్సిపాలిటీ ఆఫీసులోకి నూతన కార్యాలయాన్ని ఆదివారం ఏసిబి డిఎస్పీ వై.రమేష్ ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసీబీ పట్ల ప్రజలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని అనేక అవగాహన ప్రభుత్వ కార్యాలయలో కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.ఏదైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు అందించాలని ఆయన సూచించారు.వివరాలు గోప్యంగా ఉస్తామని అవినీతి అక్రమాల అరికట్టడంలో ప్రజలకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ఘనంగా కాంగ్రెస్ నాయకుని పుట్టినరోజు వేడుకలు



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 15:

మండలంలోని తుమ్మలగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లం మల్లయ్య పుట్టినరోజు వేడుకలు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా స్థానిక రహదారి బంగ్లాలు కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి జమీరుద్దీన్, మాజీ ఎంపీటీసీ సాల్వేరు అశోక్, నాయకులు బొడ్డు సురేందర్రావు గోదాస్ శ్రీమన్నారాయణ ఆముద లక్ష్మణ్ కక్కిరేణి రవీందర్, నోముల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి పదవీ విరమణ వేడుకలో దైద రవీందర్ దంపతులు





తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 15:నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని విష్ణు గార్డెన్‌లో నిర్వహించిన ఆత్మీయ మిత్రుడు, ఉపాధ్యాయుడు బొజ్జ వేణుగోపాల్ పదవీ విరమణ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, స్వప్న దంపతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయ వృత్తిలో వేణుగోపాల్ విద్యార్థులకు అందించిన సూచనలు, సలహాలు, సేవలను గుర్తుచేసుకుంటూ అభినందించారు. ఆయన పదవీ విరమణ అనంతరం సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

సముద్ర స్నానానికి వెళ్లి నైజీరియా విద్యార్థి మృతి

తొలి అక్షరం/కాకినాడ, నవంబర్ 15:

కాకినాడ రూరల్‌లోని సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో సముద్ర స్నానానికి వెళ్లిన ఆరుగురు నైజీరియా యువకుల్లో ఒకరు ప్రమాదవశాత్తు సముద్రంలో మునిగి మృతి చెందారు. మృతుడిని నైజీరియాకు చెందిన ఫెనెలె ఎన్క్యూబ్‌గా గుర్తించారు.సమాచారం అందుకున్న పోలీసులు స్పీడ్ బోట్‌తో గాలింపు చర్యలు చేపట్టారు. తప్పిపోయిన యువకుడిని గుర్తించి సముద్రం నుంచి బయటకు తీసుకొచ్చి సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. మృతుడు ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థిగా గుర్తించారు.

కొవ్వాడ సర్పంచ్ అభ్యర్థిగా బాలకుమార్ నామినేషన్

తొలి అక్షరం/కాకినాడ, నవంబర్ 15:కాకినాడ రూరల్ మండలం కొవ్వాడ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా మోర్తా బాలకుమార్ ఆదివారం తన నామినేషన్ దాఖలు చేశారు. సాయంత్రం గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి ర్యాలీగా బయలుదేరి నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. అనంతరం ఎన్నికల సిబ్బందికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. సంబంధిత సాంకేతిక అధికారి పత్రాలను దాఖలు చేశారు. బాల కుమార్ రత్న భూమి దినపత్రికకు సంపాదకులుగా వ్యవహరించి గ్రామంలో ఉన్న సమస్యలను వెలుగులో తీసుకురావడం, అధికారులకు తెలియజేసి వాటిని పరిష్కరించడంలో ఎంతో శ్రద్ధ చూపిన బాలాపై ఆ గ్రామస్తుల ఎంతో అభిమానం చూపారు.కాకినాడ రూరల్ పాత్రికేయులు, గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

కూనూరు ముత్తమ్మ మృతి పట్ల మంద వేణుగోపాల్ రెడ్డి సంతాపం





తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 15:చిట్యాల పట్టణానికి చెందిన నా మిత్రుడు జర్నలిస్ట్ కూనూరు మధు మాతృమూర్తి కూనూరు ముత్తమ్మ పరమపదించడం అత్యంత బాధాకరమని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద వేణుగోపాల్ రెడ్డి అన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే ఆయన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కూనుసు సంజయ్ దాస్ గారితో కలిసి మధు నివాసానికి వెళ్లారు. అక్కడ కీర్తిశేషురాలు ముత్తమ్మ గారి భౌతికకాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మధును, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. మిత్రుడు మధు మాతృమూర్తి ముత్తమ్మ గారి మరణవార్త విని నా మనసు ఎంతో కలత చెందింది. జీవితంలో అమ్మ లేని లోటు ఎవరూ తీర్చలేనిది. ఈ తీరని విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ దేవుడు మధుకు, వారి కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో నర్ర బిక్షం రెడ్డి , గణేష్, శివ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత పూజలు





తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 15: యాదాద్రి భువనగిరి జిల్లారామన్నపేట పట్టణంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత పూజలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ లవణం ఉపేందర్ తెలిపారు.పట్టణ ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, పాడిపంటలు బాగుండాలని కోరుతూ ఈ సామూహిక వ్రత పూజలను నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆలయ పూజారిఎం శ్రీనివాస్ చార్యులు వ్రత పూజల అనంతరం దంపతులకు భక్తులకు తీర్థ ప్రసాదాలు ఆశీర్వాదాన్ని అందజేసినారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఉపేందర్ జానకి, కొంపెల్లి సురేష్ సుమలత, బాసరాజు అశోక్ కుమార్ ఇందు , తాటికొండ కిరణ్ కుమార్ స్వాతి,లవణం నరేందర్ పావని, లవణం బాలు భావన, సోమ నరసింహ చారి,గంజి నరేష్, కామిశెట్టి రాధా కిషన్, మంజుల, ఆదిలక్ష్మి, గంగుల రమ్య,సింధు,ఉష, దివ్య, జ్యోతి, హర్షిని, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందించిన మాజీ ఎంపీటీసీ అశోక్



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 15: రామన్నపేట పట్టణ కేంద్రంలోని నిరుపేద మిర్యాల యాదయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందడంతో మృతదేహాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం మృతుని కుటుంబానికి రామన్నపేట మాజీ ఎంపీటీసీ సాల్వేరు అశోక్ 5000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎండి జమీరుద్దీన్, నాయకులు ఎండి నాసర్, ఎండి అక్రమ్, బండ లింగస్వామి, కక్కురేణి రవీందర్, ఆముద లక్ష్మణ్, ఈతపుల రాజు తదితరులు పాల్గొన్నారు.

20వ వార్డులో బోరు మోటార్ సమస్యకు పరిష్కారం

- కౌన్సిలర్ పినమోని గోపాల్ చొరవతో తాగునీటి సమస్యకు చెక్



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 15: షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు మిర్చి గల్లీలో బోరు మోటార్‌కు సంబంధించిన కేబుల్ మరమ్మతు పనులు చేపట్టారు. బోరు మోటార్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో స్థానికులు నీటి సరఫరా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానికులు కౌన్సిలర్ పినమోని గోపాల్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే మున్సిపల్ సిబ్బందితో మాట్లాడి మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. సిబ్బంది సహకారంతో కేబుల్ మరమ్మతులు పూర్తి చేయడంతో బోరు మోటార్ తిరిగి పనిచేసేలా సమస్య పరిష్కారమైంది. దీంతో స్థానికులకు నీటి ఇబ్బందులు తొలగనున్నాయి. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు కౌన్సిలర్ తెలిపారు. వార్డులో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని పేర్కొన్నారు. మరమ్మతు పనులకు సహకరించిన మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

తాళ్లపూసపల్లి, కాంగ్రెస్ పార్టీ గ్రామఅధ్యక్షులుగా కాలేరు వెంకన్న

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సమ్మిగౌడ్ సమక్షంలో గ్రామ కమిటీ ఏకగ్రీవ తీర్మానం





కేసముద్రం తొలిఅక్షరం/నవంబర్ 15:కేసముద్రం మండలం తాళ్లపూస పెళ్లి గ్రామం లో మాజీ జడ్పీటీసీ కదిర సురేందర్, పీసీసీ సభ్యులు దస్రు నాయక్, బండారు దయాకర్ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి,పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్,స్థానిక శాసనసభ్యులు డా. మురళీనాయక్,డీసీసీ అధ్యక్షు రాలు ఉమా మురళీనాయక్ ఆదేశాల మేరకు కేసముద్రం మండల కమిటీ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆధ్వర్యంలో మండలం లోని అన్నీ గ్రామాల నూతన కమిటీల ఎన్నికల ప్రక్రియను ప్రారం భించారు. కేసముద్రం మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేటి కొమురయ్య అధ్యక్షతన, గ్రామంలో గ్రామపార్టీ అధ్యక్షులు నూకల వెంకటేశ్వర్లు అధ్యక్షతన,మండల పార్టీ అధ్యక్షులు సమ్మిగౌడ్ సమక్షంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ ప్రముఖుల తో కలిసి నూతన గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు.గ్రామం లోని సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వార్డ్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు,కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకలు అందరూ కలిసికట్టుగా, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతలకు కట్టుబడి,ఎలాంటి పోటీలకు, భేషజాలకు వెళ్లకుండా మంచి మనస్సుతో, స్నేహాభావం తో సెంట్రల్ లో రాజీవ్ గాంధీ ని ప్రధానమంత్రి ని,మళ్ళీ రెండవ సారి కాంగ్రెస్ పార్టీ నీ,రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఏర్పాటు లో మనమంతా భాగస్వాములు కావాలనే అంకిత భావం తో అందరూ కలిసికట్టుగా ఏకగ్రీవ తీర్మానం చేసి తాళ్లపూసపల్లి "గ్రామ పార్టీ అధ్యక్షులు గా కాలేరు వెంకన్న ను,ప్రధాన కార్యదర్శిగా గౌండ్ల లక్ష్మణ్,ఉపాధ్యాక్షులుగా శీలంయాకన్న,కోశాధికారిగా నరేటి సుధాకర్ లను, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చెగిరెడ్డి ఘనపూర్‌లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

- పేదల సొంతింటి కల సాకారం.. ఇందిరమ్మ ఇంట్లో గృహప్రవేశం
- ఇందిరమ్మ ఇల్లు మంజూరుపై ఎమ్మెల్యే శంకర్‌కు లబ్ధిదారుల కృతజ్ఞతలు





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 15: జిల్లేడు చౌదరిగూడెం మండలం చెగిరెడ్డి ఘనపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న తమ కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పావని శివ, ఉపసర్పంచ్ నర్సింలు, పలువురు సర్పంచులు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం

- ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలి: మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 15: చౌదరిగూడ మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, చౌదరిగూడ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామంలో ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.



గిరాయి గుట్ట తాండా సర్పంచ్‌కు జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు

- గ్రామాభివృద్ధికి చేసిన సేవలకు ఢిల్లీలో అరుదైన గుర్తింపు
- 28 రాష్ట్రాల ప్రతినిధుల సమక్షంలో పురస్కారం అందుకున్న పాతలావత్ కృష్ణవేణి హరినాయక్





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 15: గ్రామస్థాయి ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేసిన ఫరూక్‌నగర్ మండలం గిరాయి గుట్ట తాండా సర్పంచ్ పాతలావత్ కృష్ణవేణి హరినాయక్‌కు జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. బహుజన సాహిత్య అకాడమీ అందించే జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఆమె ఎంపికయ్యారు. నవంబర్ 15న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన అకాడమీ 20వ జాతీయ సదస్సులో ఆమెకు ఈ పురస్కారాన్ని అందజేశారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం పట్ల ప్రజాప్రతినిధులకు ఉండాల్సిన బాధ్యతను గుర్తుచేస్తూ, గ్రామస్థాయిలో సేవలందిస్తున్న నాయకులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ అవార్డును ప్రదానం చేశారు. గిరాయి గుట్ట తాండాలో ఆమె అందించిన సేవలకు జాతీయ వేదికపై గుర్తింపు రావడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, చైర్మన్ ఎం.ఎం. గౌతమ్, ఢిల్లీలోని కరోల్‌బాగ్ ఎమ్మెల్యే విశ్వేశ్ రవి పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, పంజాబ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సహా దాదాపు 28 రాష్ట్రాల బహుజన సాహిత్య అకాడమీ అధ్యక్షులు హాజరయ్యారు. వివిధ రాష్ట్రాల కళాకారులు, మేధావులు, రాజకీయ నాయకులు సదస్సులో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తమ గ్రామ సర్పంచ్‌కు జాతీయ స్థాయి అవార్డు రావడంతో గిరాయి గుట్ట తాండా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పురస్కారం గ్రామానికి గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు స్ఫూర్తినిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

చిన్నారుల ప్రతిభకు పట్టాభిషేకం

ఓరుగల్లు గడ్డపై వెల్లివిరిసిన బాలల ప్రతిభ

భావితరాల కళా వారసులకు నీరాజనం... ఈగ మల్లేశం

తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి: హన్మకొండ పట్టణం స్థానిక పబ్లిక్ గార్డెన్ లోని పద్మశ్రీ డా నేరెళ్ళ వేణుమాధవ్ కళా ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ,జేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో చాచా నెహ్రూ జయంతి,బాలల దినోత్సవం పురస్కరించుకుని సకల కళల సంబరాల జాతరలో భాగంగా ఓరుగల్లు చిల్డ్రన్స్ అవార్డ్స్ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి అద్భుత ప్రదర్శనలు ఇచ్చిన చిన్నారులకు అవార్డులు ప్రధానం చేసిన ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు,కేంద్ర ఖాదీ,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అనంతరం వివిధ కళారూపాలలో అద్భుత ప్రదర్శనలు ఇచ్చిన చిన్నారులకు ఈగ మల్లేశం స్వయంగా 'ఓరుగల్లు చిల్డ్రన్స్ అవార్డ్స్ - 2026' పురస్కారాలను ప్రదానం చేసి వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చరిత్రకు,కళలకు పుట్టినిల్లయిన ఓరుగల్లు గడ్డపై కళామతల్లి ముంగిట బాలల నృత్య కేళి కనువిందు చేశాయని అన్నారు. చిన్నారుల సృజనాత్మకతను చిన్నతనం నుంచే ప్రోత్సహిస్తే వారు భవిష్యత్తులో గొప్ప కళాకారులుగా ఎదుగుతారని,చదువుతో పాటు కళల పట్ల ఆసక్తిని పెంపొందించడం తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల బాధ్యతని పేర్కొన్నారు. ప్రతి చిన్నారిలోనూ ఒక అద్భుతమైన కళాకారుడు దాగి ఉంటాడు ఆ ప్రతిభను బాల్యంలోనే గుర్తించి ప్రోత్సహిస్తే వారు భవిష్యత్తులో రాష్ట్ర,జాతీయ స్థాయిలో మన సంస్కృతికి వన్నె తెస్తారని అన్నారు. కళా రంగానికి భావితరాల వారసులను అందిస్తున్న జేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ నిర్వాహకుల కృషి ఎంతో అభినందనీయం అని కొనియాడారు. ఈ వేడుకలో వివిధ పాఠశాలల చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు,సంగీత విభావరి,సాంస్కృతిక ప్రదర్శనలు మంత్రముగ్ధులను చేశాయని తెలిపారు. సభా కార్యక్రమం అనంతరం జె.బి.కల్చరల్ ఆర్ట్ సొసైటీ నిర్వాహకులు,కళాకారులందరూ కలిసి ముఖ్య అతిథి ఈగ మల్లేశం సమాజానికి,కళారంగానికి చేసిన సేవలను కొనియాడుతూ శాలువాతో ఘనంగా సత్కరించి ప్రత్యేక జ్ఞాపికను (మెమెంటో) బహుకరించారు. ఈ కార్యక్రమంలో జేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ నిర్వాహకులు జడల శివ,జడల హరిత,గట్టు మహేష్ బాబు,అనిత రెడ్డి,పెద్ది అజయ్ కుమార్,వ్యాఖ్యాత సింగర్ జనగాం రాము,సింగర్ చంద్రశేఖర్ కరిమిల్ల సంపత్ రావు,గుడికందుల సంపత్ కుమార్,రోజారాణి,సూర్య ప్రకాష్,తను సాయి,కూర రాము,చందన,బిక్షపతి,తిప్పల జోష్నా తదితరులు పాల్గొన్నారు.



మల్లారెడ్డిపల్లిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- పంచాయతీ, వీవో భవనాలు ప్రారంభం.. కొత్తగా మంజూరైన చేయూత పింఛన్ల పంపిణీ



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: వర్ధన్నపేట నియోజకవర్గం హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ, మహిళా సంఘాల వీవో భవనాలను మంత్రి సీతక్క, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. అనంతరం కొత్తగా మంజూరైన చేయూత పింఛన్లను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళా సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని, మల్లారెడ్డిపల్లికి మరిన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాజు కృష్ణవేణి యుగేందర్ యాదవ్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి: డా. రాణా ప్రతాప్ రెడ్డి



తొలి అక్షరం/వరంగల్ ప్రతినిధి: నర్సంపేట రూరల్ మండలంలో బీజేపీ కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు తలుగుల అంబేద్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి వెన్నెముకని, బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని సూచించారు. ప్రజల పక్షాన నిలిచి, ప్రతి కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని అన్నారు. మండల అధ్యక్షుడు తలుగుల అంబేద్కర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల్లో విజయానికి సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా, మండల నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో ఘనంగా ఛఠ్ పూజ వేడుకలు

సూర్య భగవానుడికి భక్తుల ప్రత్యేక పూజలు

ఇతర రాష్ట్రాల ప్రజలతో కలిసి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్






తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 15: షాద్‌నగర్ పట్టణంలో ఛఠ్ పూజ వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన ప్రజలు సంప్రదాయబద్ధంగా సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం ప్రార్థించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్థానిక నాయకులతో కలిసి హాజరై భక్తులకు పండుగ శు భాకాంక్షలు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి షాద్‌నగర్‌లో నివసిస్తున్న ప్రజల ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ వారితో కలిసి పూజల్లో పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ పండుగలో నహాయ్ ఖాయ్, ఖర్నా, అస్తమించే సూర్యుడికి, ఉదయించే సూర్యుడికి అర్ఘ్యం సమర్పించడం ప్రధాన ఆచారాలు. నిర్జల ఉపవాస దీక్షలతో భక్తులు సూర్యుడిని ఆరాధించారు. వివిధ రాష్ట్రాల ప్రజలు కలిసి పండుగ జరుపుకోవడం ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలిచింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, కౌన్సిలర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా సదర్ సయ్యాట 2026

- యాదవ నగర్‌లో వేడుకల నిర్వహణ





తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి: యాదవుల సంస్కృతి,సంప్రదాయాలు,ఐక్యత, ఆత్మీయతను చాటిచెప్పే సదర్ సయ్యాట 2026 వేడుకలు యాదవ నగర్‌లో అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించబడ్డాయి. శ్రీకృష్ణ యాదవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదర్ సయ్యాట2026 వేడుకలకు జక్కుల రవీందర్ యాదవ్, 62వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్,కాజీపేట, హనుమకొండ జిల్లా ముఖ్యఅతిథిగా హాజరై యాదవ సోదరుల మధ్య సదర్ సయ్యాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా నాయకులు మూగల కుమార్ యాదవ్,సిద్ధిరాజ్ యాదవ్ అఖిలభారత యాదవ మహాసభ జనగామ జిల్లా అధ్యక్షులు,మాజీ కార్పొరేటర్లు విజయ్ భాస్కర్,జక్కుల శ్రీనివాస్ యాదవ్,అశోక్ యాదవ్,జోరుక రమేష్,అలాగే రజిని,అశోక్,రాజు యాదవ్,నాగరాజు యాదవ్,శ్రీధర్ యాదవ్ నాలుగో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,హనుమకొండ జిల్లా మహిళా సోదరీమణులు,యాదవ పెద్దలు,యువజన సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సదర్ సయ్యాట వేడుకలు యాదవుల ఐక్యతకు,ఆత్మీయతకు ప్రతీకగా నిలిచాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

కొత్తూరులో ఘనంగా ప్రారంభమైన చత్ మహాపర్వ్

హాజరై ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్





తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 15: ప్రకృతి మాతను,సూర్య భగవానుడిని ఆరాధించే అత్యంత పవిత్రమైన జాతీయ పండుగ 'చత్ పండుగని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని ఛట్ పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ..సూర్యారాధనకు ప్రతీకగా నిలిచే ఈ మహాపర్వం ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ప్రధాని ఆకాంక్షించారు. ముఖ్యంగా బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల్లో స్థిరపడిన కోట్లాది మంది భక్తులు ఈ పండుగను అత్యంత భక్తిభావంతో జరుపుకుంటారని ఆయన అన్నారు. నదులు,జలాశయాల వద్ద ప్రత్యేక ఘాట్‌లను ముస్తాబు చేసి, సూర్యోదయం,సూర్యాస్తమయ వేళల్లో అర్ఘ్య ప్రధానం చేసేందుకు భక్తులు పెద్దఎత్తున తరలి వస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,మాజీ కౌన్సిలర్ మాదారం నర్సిములు గౌడ్,సోమ్లా నాయక్, జె. శ్రీనివాస్ గౌడ్,నాయకులు సిటీ కేబుల్ వెంకటేష్,శివ చారి,జంగగళ్ల అనిల్,శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో హాజీపల్లి, సిండికేట్ కాలనీలకు హైమాస్ట్ లైట్లు.ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



తొలి అక్షరం/ఫరూఖ్‌నగర్, నవంబర్ 15: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజీపల్లి గ్రామం, సిండికేట్ కాలనీలో ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి తన సొంత నిధులతో రెండు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించారు. ఆదివారం సాయంత్రం ఆయన వాటిని ప్రారంభించారు. రాత్రివేళల్లో చీకటి సమస్య తొలగి, ప్రజలకు సురక్షిత ప్రయాణానికి వీలు కలగనుంది. ఈ సందర్భంగా గ్రామస్థులు, కాలనీ వాసులు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హాజీపల్లి సర్పంచ్ కుమార్, మాజీ కౌన్సిలర్లు ఈశ్వర్ రాజు, కానుగు అనంతయ్య, నందకిషోర్, పలువురు సర్పంచులు, ఉపసర్పంచ్ ఇసునాతి గంగాధర్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కార్తీక తొలి సోమవారం.. దీపపు వెలుగులో ఆధ్యాత్మిక సందేశం!

దీపారాధనలో జ్ఞానజ్యోతి.. శివనామస్మరణలో మనశ్శాంతి.. మానవత్వమే నిజమైన భక్తి!

కార్తీక మాసం ప్రకృతి పులకించే పవిత్ర సమయం. అందులో తొలి సోమవారం భక్తిభావానికి ప్రత్యేకమైన ఆరంభం. వేకువజామున పవిత్ర స్నానాలు, శివాలయాల్లో పూజలు, దీపారాధనలు, శివనామస్మరణతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతారు.

ఇంటి గడపపై వెలిగించే దీపం కేవలం చీకటిని తొలగించడమే కాదు.. మనలోని అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని వెలిగించాలనే సందేశాన్ని ఇస్తుంది. శివలింగంపై చేసే అభిషేకం అహంకారాన్ని విడిచిపెట్టి వినయాన్ని అలవర్చుకోవాలని సూచిస్తుంది. బిల్వదళ సమర్పణలో భక్తి, నమస్కారంలో వినయం, మాటల్లో నిజాయితీ ఉండాలని గుర్తుచేస్తుంది.

ఉపవాసం అంటే కేవలం ఆహారానికి దూరంగా ఉండటం మాత్రమే కాదు. చెడు ఆలోచనలను విడిచిపెట్టడం, కోపాన్ని అదుపు చేసుకోవడం, ఇతరులను బాధించకుండా ఉండటం, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కూడా ఉపవాసంలోని అసలైన అంతరార్థాలే.

చంద్రశేఖరుడైన పరమశివుడికి సోమవారం ప్రత్యేకమైనదనే విశ్వాసంతో భక్తులు శివాలయాలను దర్శించుకుని 'ఓం నమఃశివాయ' మంత్రాన్ని జపిస్తారు. ఈ శివనామస్మరణ మనసుకు ప్రశాంతతను, జీవితానికి ఆధ్యాత్మిక దిశను అందిస్తుంది.

మానవత్వమే నిజమైన భక్తి

ఒక దీపం వెలిగించి చీకటిని తొలగించినట్లే.. మన చేతనైన సాయంతో మరొకరి జీవితంలో వెలుగు నింపాలి. దేవుడిని ప్రార్థించడంతో పాటు కష్టాల్లో ఉన్నవారికి చేయూతనివ్వాలి. గుడిలో పూజతో పాటు గుండెల్లో మానవత్వాన్ని నిలుపుకోవాలి. ఇదే కార్తీక తొలి సోమవారం అందించే గొప్ప సందేశం.

ఓ పరమశివా.. ప్రతి ఇంటా ఆనందం, ఆయురారోగ్యాలు నిండాలి. ప్రతి మనసులో ప్రేమ, ప్రతి హృదయంలో ప్రశాంతత వెల్లివిరియాలి. ద్వేషం తొలగి మానవత్వం పరిఢవిల్లాలి.

హర హర మహాదేవ.. శంభో శంకర!

– కవిత్వ రూపకల్పన: ఆకుల



రామన్నగూడెంలో ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

- అయ్యప్ప మాలధారణ చేసిన గడ్డం రాజశేఖర్ ఆధ్వర్యంలో పూజలు.. భక్తిశ్రద్ధలతో పాల్గొన్న గ్రామస్థులు



తొలిఅక్షరం/నర్సింహులపేట, నవంబర్ 15: నర్సింహులపేట మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన గడ్డం జన్నయ్య దంపతుల కుమారుడు గడ్డం రాజశేఖర్ అయ్యప్ప స్వామి మాలధారణ చేసిన సందర్భంగా ఆదివారం గ్రామంలో పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మాలధారులు, భక్తులు స్వామివారి నామస్మరణతో పూజల్లో పాల్గొన్నారు. భజనలు, భక్తి గీతాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమానికి గ్రామస్థులు, అయ్యప్ప స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

పుస్తకాలే జీవితానికి సరైన దిశానిర్దేశం

- 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో పుస్తక ప్రదర్శన ప్రారంభం



తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, నవంబర్ 15: పుస్తకాలే జీవితానికి సరైన దిశానిర్దేశం చేస్తాయని జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి పసునూరి రాజేంద్రప్రసాద్ అన్నారు. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లల్లో పుస్తక పఠన అలవాటు పెంపొందించాలని సూచించారు. పుస్తకాలు విజ్ఞానాన్ని పెంచడమే కాకుండా ఆలోచనా శక్తి, సృజనాత్మకత, మంచి వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేస్తాయని తెలిపారు. విజ్ఞాన సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలు పునాదులని పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు జి. విజేందర్, రుద్రారపు వీరేందర్, సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొలి లఘుచిత్రానికే ఉత్తమ దర్శకురాలి పురస్కారం.. శ్రీజ సాదినేని ఆనందం

47 నాటకాలకు దర్శకత్వం వహించి.. తొలి ప్రయత్నంలోనే అంతర్జాతీయ గుర్తింపు

వెండితెరపై దర్శకురాలిగా పేరు చూసుకోవడమే జీవిత లక్ష్యమని వెల్లడి



తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 15: రంగస్థలంపై తనదైన ముద్ర వేసిన రచయిత్రి, దర్శకురాలు శ్రీజ సాదినేని ఇప్పుడు వెండితెరపై తన కలలను సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే 47 నాటకాలకు దర్శకత్వం వహించిన ఆమె, తొలిసారిగా రూపొందించిన 'కంచె చేను మేస్తే' లఘుచిత్రానికి రెయిన్‌బో అంతర్జాతీయ బాలల ఏడవ చలనచిత్రోత్సవంలో ఉత్తమ దర్శకురాలి పురస్కారం లభించింది. తొలి ప్రయత్నంలోనే ఈ అంతర్జాతీయ గుర్తింపు దక్కడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శ్రీజ సాదినేని మాట్లాడుతూ తనకు లభించిన ప్రతి పురస్కారం వెనుక ఎంతో శ్రమ, అనుభవం, సుదీర్ఘ ప్రయాణం ఉన్నాయని పేర్కొన్నారు. లఘుచిత్ర దర్శకురాలిగా తొలి అడుగులోనే ఉత్తమ దర్శకురాలి పురస్కారం అందుకోవడం తనకు ఎంతో ప్రత్యేకమని తెలిపారు. రవీంద్రభారతిలో జరిగిన ప్రదర్శన సందర్భంగా పెద్ద తెరపై 'దర్శకత్వం: శ్రీజ సాదినేని' అని తన పేరును చూసుకున్న క్షణం ఆనందంతో కళ్లలో నీళ్లు తిరిగాయని గుర్తుచేసుకున్నారు. చిత్రాన్ని చూసిన ప్రేక్షకులు భావోద్వేగానికి గురై కంటతడి పెట్టడం, వేదికపై ప్రత్యేకంగా ప్రశంసించడం తనలో మంచి సినిమాలను తెరకెక్కించగలననే ఆత్మవిశ్వాసాన్ని నింపిందన్నారు. భవిష్యత్తులో వెండితెరపై దర్శకురాలిగా తన పేరును చూసుకోవాలన్నదే జీవిత ఆశయమని, మంచి కథలతో మహిళా దర్శకురాలిగా చిత్ర పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు.**శిష్యులతో కలిసి తొలి ప్రయత్నం..**ఇటీవల తాను నటించిన 'గరివిడి లక్ష్మి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించిందని, నటిగా అవకాశాలు వస్తున్నప్పటికీ కెమెరా వెనుక ఉండి కథను తెరకెక్కించడంలోనే తనకు ఎక్కువ సంతృప్తి ఉందని శ్రీజ స్పష్టం చేశారు. 'కంచె చేను మేస్తే' లఘుచిత్రంలో నటించినవారు, డబ్బింగ్ చెప్పినవారు అందరూ తన విద్యార్థులేనని తెలిపారు. గురువుగా తాను నటన నేర్పిన విద్యార్థులతో కలిసి రూపొందించిన తొలి చిత్రానికే పురస్కారం రావడం తన ఆనందాన్ని రెట్టింపు చేసిందన్నారు. ఈ పురస్కారానికి తనను ఎంపిక చేసిన నిర్ణేతల మండలికి, రెయిన్‌బో బాలల చలనచిత్ర సమాఖ్య నిర్వాహకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన హక్కుల కోసం బిర్సా ముండా పోరాటం చిరస్మరణీయం

● జన్‌జాతీయ గౌరవ దివస్‌లో నివాళులర్పించిన కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



తొలి అక్షరం/కాకినాడ, నవంబర్ 15:గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం భగవాన్ బిర్సా ముండా చేసిన పోరాటం చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. జన్‌జాతీయ గౌరవ దివస్, బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి చేసిన ప్రసంగాన్ని అధికారులు, విద్యార్థులతో కలిసి వర్చువల్‌గా వీక్షించారు.బ్రిటిష్ పాలకులు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా గిరిజనుల భూములు, అటవీ సంపద, సంప్రదాయ హక్కుల పరిరక్షణకు బిర్సా ముండా పోరాడారని కలెక్టర్ గుర్తుచేశారు. 18991900 మధ్య ఆయన నాయకత్వంలో సాగిన 'ఉల్గులాన్' ఉద్యమం గిరిజన హక్కుల పోరాట చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని పేర్కొన్నారు. కేవలం 25 ఏళ్ల వయసులోనే ఆయన మరణించినప్పటికీ, చేసిన త్యాగం దేశానికి స్ఫూర్తిదాయకమన్నారు.గిరిజనులకు నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడం, సంక్షేమ పథకాలు అర్హులకు అందించడం, వారి సంస్కృతి, భాషలు, సంప్రదాయాలు, అటవీ హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. బిర్సా ముండా ఆశయాలకు అనుగుణంగా గిరిజనుల అభ్యున్నతికి కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు.జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిక అధికారి నయనాల నాగ మల్లేశ్వరరావు, వసతి గృహ సంక్షేమ అధికారులు, సంబంధిత అధికారులు, పోస్ట్‌మెట్రిక్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అట్టహాసంగా మున్నూరుకాపుల వన సమారాధన



ఐక్యతతోనే రాజకీయ ప్రాతినిధ్యం, పదవులు సాధ్యం: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



తొలి అక్షరం/ఖమ్మం, నవంబర్ 15 : మున్నూరుకాపుల ఐక్యత, ఆత్మగౌరవాన్ని చాటుతూ ఖమ్మం నగరంలో వన సమారాధన మహోత్సవం అట్టహాసంగా జరిగింది. మున్నూరుకాపు సంఘం ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గొల్లగూడెం రోడ్డులోని చెరుకూరి వారి మామిడి తోటలో ఆదివారం నిర్వహించిన ఈ వేడుకలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా కుల బాంధవులు తరలివచ్చారు. పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు పాల్గొని బీసీల హక్కులు, ఆత్మగౌరవం, రాజ్యాధికార సాధనపై ప్రసంగించారు.ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ఐకమత్యమే మన అసలైన బలమని, అందరూ కలిసికట్టుగా ముందుకు సాగితే పదవులు, అవకాశాలు వాటంతటవే వస్తాయన్నారు. పరస్పర విభేదాలతో ఐక్యతను దెబ్బతీసుకోవద్దని సూచించారు. సేవాభావం, క్రమశిక్షణ, కష్టపడే తత్వం, ప్రజల పట్ల అంకితభావం ఉంటే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. కోకాపేటలో మున్నూరుకాపుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.ప్రభుత్వ సలహాదారు వీ. హనుమంతరావు మాట్లాడుతూ దేశ జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, చట్టసభల్లో రిజర్వేషన్ల సాధనకు ఐక్యంగా పోరాడాలని అన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ మున్నూరుకాపుల ఐక్యతను దెబ్బతీసే కుట్రలను తిప్పికొట్టాలని, హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచుకోవాలని సూచించారు.మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ వన సమారాధన వంటి కార్యక్రమాల ద్వారా ఐక్యతను చాటుతూ రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని అన్నారు. ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ కుల ఆత్మగౌరవంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ భావితరాలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు ఐక్యత అవసరమన్నారు. జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కాపులు, మున్నూరుకాపులు అన్నదమ్ముల్లా కలిసి రాజ్యాధికార సాధనకు కృషి చేయాలని కోరారు.సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తమరావు, కోశాధికారి కంచి సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు ఆకుల రాజయ్య, ఎడవల్లి కృష్ణ, కొడిమ్యాల మధుసూదన్, మరిశెట్టి రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ స్వాగతం పలుకగా, జిల్లా అధ్యక్షుడు శీలంశెట్టి వీరభద్రం అధ్యక్షత వహించారు.మున్నూరుకాపు సమాజానికి విశేష సేవలందించిన దివంగత ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. 'జై తెలంగాణ', 'మున్నూరుకాపుల ఐక్యత వర్ధిల్లాలి', 'జై బీసీ' నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బిగ్ బాస్ వల్ల నాకు ఏం ఉపయోగం లేదు



సినిమా అవకాశాల కోసం ఎన్నో ప్రయత్నాలు.. వ్యక్తిగత జీవితంలో ఒడిదొడుకులు.. ప్రేమలో ఎదురైన చేదు అనుభవాలు.. బిగ్ బాస్ తర్వాత కెరీర్‌లో వచ్చిన మార్పులు.. ఇలా నటి ఇనయా సుల్తానా ఓ ఇంటర్వ్యూలో తన జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. సినీ పరిశ్రమలో అవకాశాల కోసం తాను పడిన కష్టాలను వివరిస్తూనే, తన బ్రేకప్‌కు గల కారణాలను కూడా బయటపెట్టారు. అంతేకాదు, బిగ్ బాస్ షో తర్వాత తన పారితోషికం తగ్గిపోయిందని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇంతకీ ఇనయా సుల్తానా ఏయే విషయాలను పంచుకున్నారంటే.. సినిమా ఇండస్ట్రీలో అవకాశాలు సంపాదించడం అంత సులభం కాదని ఇనయా సుల్తానా తెలిపారు. అవకాశాల కోసం పలువురిని స్వయంగా కలవాల్సి వచ్చిందని, కొన్నిసార్లు చిన్న చిన్న పాత్రలు చేయడానికి కూడా సిద్ధపడ్డానని గుర్తుచేసుకున్నారు. ఇండస్ట్రీలో మనుషులను హ్యాండిల్ చేయగల సామర్థ్యం తనకు ఉందని, మీడియా కూడా తనకు ఎంతో కొంత అండగా నిలిచిందని చెప్పారు. తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతూ గత ప్రేమ వ్యవహారంపై ఇనయా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు వస్తున్న పేరు, ఫేమ్, సినిమా అవకాశాలను మాజీ ప్రియుడు తట్టుకోలేకపోయేవాడని తెలిపారు. అతడి అసూయే తమ బ్రేకప్‌కు ప్రధాన కారణమని వెల్లడించారు.తన సోషల్ మీడియా ప్రొఫైల్‌లో గతంలో మాదిరిగా ఫొటోషూట్ చిత్రాలు కనిపించవని పేర్కొన్నారు. ప్రస్తుతం తాను చేస్తున్న సినిమా ప్రాజెక్టుల గురించి కూడా బయటకు చెప్పడం లేదని ఇనయా వెల్లడించారు. ప్రాజెక్టుల వివరాలు ముందుగానే పంచుకుంటే దిష్టి తగులుతుందనే భయం ఉందని, అందుకే సినిమాల విషయాలను గోప్యంగా ఉంచుతున్నట్లు తెలిపారు.తదుపరి ప్రాజెక్టుల వివరాలను వెల్లడిస్తాననే సంకేతాలిచ్చారు.

ఆ హీరో మార్కెటింగ్ ప్లాన్ అదిరిపోతుంది



ప్రస్తుత చిత్ర పరిశ్రమలోని ఆర్థిక, క్రియేటివ్ సవాళ్లపై ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తన విశ్లేషణను ఓ ఇంటర్వ్యూలో వివరించారు. పెద్ద హీరోలు అధిక పారితోషికం తీసుకుంటూ, భారీ బడ్జెట్ చిత్రాలలోనే నటించాలనే ఒత్తిడిని ఎదుర్కొంటు న్నారని ఆర్జీవీ అభిప్రాయపడ్డారు. ప్రేక్షకులు వారి నుంచి అధిక అంచనాలను పెట్టుకోవడం దీనికి కారణం అన్నారు. ఉదాహరణకు, మన ఇండస్ట్రీ పెద్ద హీరోలు 127 అవర్స్ వంటి ప్రయోగాత్మక చిత్రం చేస్తే ప్రేక్షకులు రిసీవ్ చేసుకుంటారా.? అన్నది ప్రశ్నార్థకం. స్టార్‌డమ్ అంటే కేవలం నటుడి స్క్రీన్ ప్రజెన్స్ అని, కథ కంటే కాస్టింగ్ ఫ్యాక్టర్ ముఖ్యమని ఆర్జీవీ పేర్కొన్నారు.బాలీవుడ్ స్టార్ ఆమీర్ ఖాన్ అనుసరించిన వినూత్న మార్కెటింగ్ వ్యూహాన్ని వర్మ ప్రస్తావించారు. ఆమీర్ గజిని వంటి పెద్ద హిట్ తర్వాత, తారే జమీన్ పర్ వంటి చిన్న, ఆర్ట్-హౌస్ సినిమాను తక్కువ బడ్జెట్‌తో నిర్మించి, దానిని గజిని అమ్మిన ధరలో 10వ వంతుకే అమ్మేశారు. ఈ లాజిక్ ప్రకారం, తక్కువ ధరలో అమ్మి, తక్కువ వసూళ్లు వచ్చినా సినిమా విజయం సాధించినట్లు అవుతుంది, దానివల్ల పెట్టుబడిపై రాబడి పెరుగుతుంది. ఇది భారతీయ సినీ పరిశ్రమలో చాలా మంది అనుసరించని లాజిక్ అని ఆర్జీవీ అన్నారు. భారీ బడ్జెట్ కారణంగా రాధే శ్యామ్ వంటి చిత్రాలు ఆశించిన విజయం సాధించలేదని, బాహుబలి మాత్రం నటులు హిందీ ప్రేక్షకులకు తెలియకపోయినా, భారీ విజువల్స్ కారణంగా విజయం సాధించిందని ఆయన తెలిపారు. ఆర్జీవీ తన సొంత చిత్రాలైన శివ, సత్యలను ఉదాహరణగా చూపుతూ, తనకు ఆనందం కలిగించిన కథలనే తక్కువ బడ్జెట్‌తో, వాస్తవిక లొకేషన్లలో, పక్కా ప్లాన్ తో తీశానని వివరించారు.సినిమాకు ఏం అవసరమో దానికే ఖర్చు చేశానని, డబ్బు ఆదా చేయాలనే ఉద్దేశ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. చిత్ర పరిశ్రమలో చాలా మందికి ఆడియన్స్ టేస్ట్ గురించి తక్కువ అవగాహన ఉంటుందని, ఒక సినిమా ఎందుకు హిట్ అవుతుందో లేదా ఫ్లాప్ అవుతుందో అర్థం చేసుకోలేరని ఆర్జీవీ అన్నారు. అలాగే చిల్డ్రన్ ఆఫ్ హెవెన్ అనే ఇరానియన్ చిత్రాన్ని ఇండియాలో తార రంపం పేరుతో రీమేక్ చేసిన విధానాన్ని వివరిస్తూ, అసలు సినిమా వెనుక ఉన్న ఉద్దేశ్యం (“పిల్లల కోసం సినిమా తీయడం”) మారిపోయి, వ్యాపార లాభాల కోసం ప్రయత్నించినప్పుడు ఎలాంటి నష్టాలు సంభవిస్తాయో ఆర్జీవీ ఉదహరించారు. హానెస్టీ అలాగే మెయిన్ పాయింట్ నుంచి డైవర్ట్ అవ్వడం వల్ల చిత్రనిర్మాతలకు నష్టం వాటిల్లుతుందని ఆయన చెప్పారు. విభిన్న చిత్రాలు విజయం సాధిస్తుండటాన్ని బట్టి, ప్రేక్షకులు ఏదైనా చూస్తారని స్పష్టమవుతోందని, కాబట్టి చిత్రనిర్మాతలు తమ సొంత నమ్మకాన్ని అనుసరించడమే సరైన మార్గమని ఆర్జీవీ అన్నారు.

ఇది కదా ఫ్యాన్స్‌కు కావాల్సింది.. ఎన్టీఆర్- అనిల్ రావిపూడి క్రేజీ కాంబో.. నవ్వుల విందుకు రంగం సిద్ధం!



టాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన కాంబినేషన్‌కు తెరలేచింది. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కలిసి ఓ సినిమా చేయబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు ఈ ఇద్దరి కాంబినేషన్‌లో సినిమా రాకపోవడంతో ఈ ప్రాజెక్ట్‌పై సినీ ప్రేక్షకుల్లో అంచనాలు పెరుగుతున్నాయి. తాజాగా ఎన్టీఆర్ ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. అనిల్ రావిపూడితో కలిసి దిగిన ఫొటోను షేర్ చేస్తూ ‘నవ్వుల విందు సిద్ధమవుతోంది’ అంటూ ఆసక్తికరమైన క్యాప్షన్ ఇచ్చారు. దీంతో ఈ సినిమా పూర్తిస్థాయి ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందనే హింట్ ఇచ్చేశారు. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌పై నందమూరి కల్యాణ్‌రామ్ నిర్మించనున్నారు. మరోవైపు అనిల్ రావిపూడి కూడా ఈ కాంబినేషన్‌పై స్పందిస్తూ.. ఎన్టీఆర్‌తో సినిమా చేయాలనే కోరిక ఎప్పటి నుంచో ఉందని తెలిపారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుందనే అర్థం వచ్చేలా సరదాగా అంటూ పోస్ట్ చేశారు.ప్రస్తుతం తారక్ భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘డ్రాగన్’ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం పూర్తయిన తర్వాత ఎన్టీఆర్ చేయబోయే సినిమా ఏదనే విషయంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో అనిల్ రావిపూడితో సినిమా ప్రకటన రావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రశాంత్ నీల్ సినిమాతో యాక్షన్ మోడ్‌లో కనిపించనున్న తారక్.. అనిల్ రావిపూడి దర్శకత్వంలో మాత్రం తనలోని కామెడీ టైమింగ్‌ను మరోసారి చూపించే అవకాశం ఉంది. అనిల్ సినిమాల్లో కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు హీరో ఎలివేషన్స్‌కు కూడా ప్రత్యేక స్థానంచూపించే అవకాశం ఉంది. అనిల్ సినిమాల్లో కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్‌ను ఆయన ఎలా చూపించబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది.ఇదిలా ఉంటే ఇప్పటికే ఎన్టీఆర్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఓ భారీ పౌరాణిక నేపథ్య చిత్రం తెరకెక్కనుందనే వార్తలు వచ్చాయి. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులకు సమయం పట్టే అవకాశం ఉండటంతో, ఈలోపు మరో సినిమా చేయాలని ఎన్టీఆర్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

బలగం సినిమా ఆడిషన్‌కు వెళ్ళినప్పుడు దిల్ రాజు చెప్పిన మాటకు షాక్ అయ్యా.!



తెలుగు సినీ ప్రేక్షకులకు బాలనటిగా పరిచయమైన కావ్య కళ్యాణరామ్, తన అద్భుతమైన నటనతో ప్రస్తుతం కథానాయికగా దూసుకుపోతున్నారు. ఇటీవల విడుదలైన మసూద అలాగే బలగం వంటి చిత్రాలతో విజయాలను సొంతం చేసుకున్న కావ్య, తన సినీ ప్రయాణం, చిత్రాల ఎంపిక, వ్యక్తిగత విషయాల గురించి ఓ ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించారు. చిన్నతనంలోనే సినీరంగ ప్రవేశం చేసిన కావ్య, అప్పటి టాప్ హీరోలతో కలిసి నటించి మంచి గుర్తింపు పొందారు.ఇప్పుడు కూడా క్రేజ్ ఉన్న హీరోలతో పనిచేశారని ఇంటర్వ్యూలో ప్రియదర్శి గుర్తు చేశారు. పెద్దయ్యాక తిరిగి సినిమాల్లోకి రావాలని నిర్ణయించుకున్నప్పుడు, ఆమె మొదట ప్రముఖ దర్శకుడు కె. రాఘవేంద్ర రావు గారిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయనను గురూజీ అని పిలిచే కావ్య, రాఘవేంద్ర రావు గారు తనకు సొంత మనిషిలా భావించి సినీ రంగం గురించి జాగ్రత్తలు చెప్పారని పేర్కొన్నారు. “ఈ ఫీల్డ్ చాలా కష్టం, చిన్నప్పటిలాగా కాదు. మంచి సినిమాలు చూసి చెయ్యి. పది సినిమాలు చేయనవసరం లేదు, చేసిన ఒకటి, రెండు బాగా చెయ్యి. చదువుకున్నావు, అది వదలద్దు” అని ఆయన ఇచ్చిన సలహా తనకెంతో ముఖ్యమని కావ్య తెలిపారు.ఇప్పుడు కూడా క్రేజ్ ఉన్న హీరోలతో పనిచేశారని ఇంటర్వ్యూలో ప్రియదర్శి గుర్తు చేశారు. పెద్దయ్యాక తిరిగి సినిమాల్లోకి రావాలని నిర్ణయించుకున్నప్పుడు, ఆమె మొదట ప్రముఖ దర్శకుడు కె. రాఘవేంద్ర రావు గారిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయనను గురూజీ అని పిలిచే కావ్య, రాఘవేంద్ర రావు గారు తనకు సొంత మనిషిలా భావించి సినీ రంగం గురించి జాగ్రత్తలు చెప్పారని పేర్కొన్నారు. “ఈ ఫీల్డ్ చాలా కష్టం, చిన్నప్పటిలాగా కాదు. మంచి సినిమాలు చూసి చెయ్యి. పది సినిమాలు చేయనవసరం లేదు, చేసిన ఒకటి, రెండు బాగా చెయ్యి. చదువుకున్నావు, అది వదలద్దు” అని ఆయన ఇచ్చిన సలహా తనకెంతో ముఖ్యమని కావ్య తెలిపారు.మసూద చిత్రాన్ని అంగీకరించడానికి గల కారణాన్ని వివరిస్తూ, కథే తనను ఆకట్టుకుందని కావ్య తెలిపారు. దిల్‌రాజ్ సమర్పణలో స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ చిత్రంలో, మళ్ళీ రావా మరియు ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ వంటి మంచి సినిమాలు నిర్మించిన వారిపై నమ్మకంతోనే తాను సినిమాను ఒప్పుకున్నానని చెప్పారు.

ఈ వారం థియేటర్లలో 10 కొత్త సినిమాలు



దీపావళి కానుకగా రిలీజైన రామాయణ, సీన్ సినిమాలు సూపర్ హిట్ టాక్ తో రన్ అవుతున్నాయి. అయితే ఈ వారం కూడా భారీగా సినిమాలు థియేటర్లలో సందడి చేయనున్నాయి. ఇట్లు అర్జున, గోట్(+.ూ.ూ.ు), భోగి, మాయ లేడీ, డార్క్ చాక్లెట్, దొంగ నా కొడుకు, చంద్రయాన్, జింగో పెన్, అ, టాల్కమ్ పౌడర్.. ఇలా దాదాపు 10 కు పైగా సినిమాలు వెండితెరపై సందడి చేయనున్నాయి. మరోవైపు ఓటీటీలోనూ పెద్ద ఎత్తున సినిమాలు స్ట్రీమింగ్ కు రాబోతున్నాయి. దసరాకు థియేటర్లలో రిలీజైన సినిమాలన్నీ ఈ వారంలోనే ఓటీటీలోకి వచ్చే అవకాశముంది. జైలర్ 2, రణబాలి స్ట్రీమింగ్ డేట్స్ సినిమాల స్ట్రీమింగ్ డేట్స్ ఖరారు కాగా క్రేజీ కల్యాణం కూడా ఈ వీకెండ్ లోనే స్ట్రీమింగ్ కు వచ్చే ఛాన్స్ ఉంది. వీటితో పాటు దాయిరా, వైబ్, పరివారిక్ మనురంజన్ లాంటి డబ్బింగ్ చిత్రాలు.. పుష్పక విమానం అనే తెలుగు సిరీస్ ఉన్నంతలో చూడాలనే ఆసక్తి కలిగిస్తున్నాయి. మరి ఈ వారంలో ఏయే సినిమా ఏయే ఓటీటీలో వస్తుందో తెలుసుకుందాం రండి.నెట్‌ఫ్లిక్స్‌ద గుడ్ లాయర్ (ఫ్రెంచ్ సినిమా) -- నవంబర్ 09ద బాడీ (ఇంగ్లిష్ వెబ్ సిరీస్) -- నవంబర్ 11నెవర్ సరండర్ (ఇండోనేసియన్ సినిమా) -- నవంబర్ 12మిరాకిల్స్ ఆఫ్ ఈఆర్ (కొరియన్ వెబ్ సిరీస్) -- నవంబర్ 12దాయిరా (హిందీ మూవీ) -- నవంబర్ 13రణబాలి (తెలుగు సినిమా) -- నవంబర్ 13హార్ట్ ల్యాండ్ (కెనడియన్ వెబ్ సిరీస్) -- నవంబర్ 13కంక్ ఆన్ సినిమా (ఇంగ్లిష్ మాక్యుమెంటరీ) -- నవంబర్ 15అమెజాన్ ప్రైమ్ వీడియోజైలర్ 2 (తెలుగు డబ్బింగ్ సినిమా) -- నవంబర్ 12వైబ్ (హిందీ చిత్రం) -- నవంబర్ 13జియో హాట్‌స్టార్పుష్పకవిమానం (తెలుగు వెబ్ సిరీస్) -- నవంబర్ 12స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్: ఆఫ్టర్ డార్క్ (హిందీ వెబ్ సిరీస్) -- నవంబర్ 13జీ5బ్లైండ్ గేమ్ (హిందీ సినిమా) -- నవంబర్ 11
బాంద్రా (తెలుగు డబ్బింగ్ మూవీ) -- నవంబర్ 13అఫ్రాతఫ్రీ (మరాఠీ చిత్రం) -- నవంబర్ 13మిర్గయ 1.5 (బెంగాలీ) -- నవంబర్ 13

ఆ సమస్య వాళ్ళ కొన్ని సంవత్సరాలు డిప్రెషన్ లోకి వెళ్లా...



నటి బిందు మాధవి తన సినీ ప్రస్థానం, వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లు, ముఖ్యంగా ప్రేమ విషయంలో డిప్రెషన్‌తో పోరాడిన అనుభవాలు, మరియు తెలుగు చిత్ర పరిశ్రమకు తిరిగి రావాలనే తన ఆశయాలను ఇండియాగ్లిట్జ్ తెలుగుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆమె వెల్లడించిన విషయాలు సినీ ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించిన బిందు మాధవి, మొదట చెన్నైకి వెళ్లి మోడలింగ్ చేశారు. ఆ తర్వాత సెగ అనే సినిమా ద్వారా ఆమె సినీ రంగ ప్రవేశం చేశారు.తెలుగులో ఆవకాయ్ బిర్యానీ చిత్రం ఆమెకు ఒక బ్రేక్ అని చెప్పవచ్చు. ఈ సినిమా తర్వాత ఆమె హైదరాబాద్‌కు షిఫ్ట్ అయ్యారు, ఆమె తండ్రి ప్రభుత్వ ఉద్యోగి కావడంతో గుంటూరు, విజయవాడలో పనిచేసేవారు. బిందు మాధవి హైదరాబాద్‌లో స్థిరపడాలని భావించడంతో ఆమె తండ్రి కూడా ట్రాన్స్‌ఫర్ చేయించుకొని వచ్చారు. అయితే, తెలుగులో ఆమె ఆశించిన స్థాయిలో సరైన పాత్రలు లభించలేదు. కేవలం పక్కన నిలబడటం, నవ్వడం, ఒక పాటలో కనిపించడం వంటి పాత్రలే వస్తూ ఉండేవని, వాటి పట్ల తనకు ఆసక్తి లేదని ఆమె స్పష్టం చేశారు. అవకాశాలు బ్రేక్ తీసుకోవాల్సి వచ్చింది. దీనికి గల కారణాలను వివరిస్తూ, ఆమె వ్యక్తిగత సమస్యల కారణంగా డిప్రెషన్‌తో బాధపడినట్లు తెలిపారు.అప్పుడు తనకు వచ్చిన అవకాశాలతో తాను సంతృప్తిగా లేనని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆవె తిరిగి చెన్నైకి వెళ్లి అక్కడ ఆడిషన్స్ ఇచ్చి తమిళ చిత్రాలలో అవకాశాలు సంపాదించారు. తమిళంలో తనకు లభించిన పాత్రలతో ఆమె సంతోషంగా ఉన్నానని పేర్కొన్నారు. అయితే, తమిళంలో కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడే ఆమె సుమారు మూడు నుండి నాలుగు సంవత్సరాలు బ్రేక్ తీసుకోవాల్సి వచ్చింది. దీనికి గల కారణాలను వివరిస్తూ, ఆమె వ్యక్తిగత సమస్యల కారణంగా డిప్రెషన్‌తో బాధపడినట్లు తెలిపారు.

Editor Pastham Saidulu, Tholi Aksharam, PRGI No. TGMUL/25/A1386,Gmail: tholiaksharam@gmail.com , Printing : R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad, Cell No: 8074571329, Telangana State, India.